క్లుప్తంగా

బషీర్ బీబీని దర్శించుకున్న డీఎస్పీ



ఉత్సవాల్లో పోలీసు సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఎస్పీ హనుమంతురావు

కొత్తపల్లి: మండలంలోని పొన్నాడలో వేంచేసిన బషీర్‌బీబీ (బంగారు పాప)ని శుక్రవారం కాకినాడ డీఎస్పీ హనుమంతురావు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక ముజావర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. బందోబస్తును పరిశీలించి పోలీసులకు పలు సూచనలు ఇచ్చారు. ఆయన వెంట పిఠాపురం సీఐ శ్రీనివాస్, ఎస్సై స్వామినాయుడు ఉన్నారు.

హెల్త్ ఇన్‌స్పెక్టర్ సేవలు అభినందనీయం



కిశోర్‌కు వీడ్కోలు పలుకుతూ కల్యాణికి స్వాగతం పలుకుతున్న స్టేషన్ మేనేజరు

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్‌లో చీఫ్ హెల్త్ ఇన్‌స్పెక్టర్‌గా కె.కిశోర్ ఉత్తమ సేవలందించారని రైల్వే స్టేషన్ మేనేజరు ఎం.రమేష్ అన్నారు. సుమారు రెండేళ్ల పాటు ఇక్కడ పని చేసిన కిశోర్ సికింద్రాబాద్ బదిలీ కావడంతో శుక్రవారం ఆయనను సత్కరించి వీడ్కోలు పలికారు. అలగే కిశోర్ స్థానంలో విజయవాడ నుంచి ఇక్కడకు వచ్చిన కల్యాణికి స్వాగతం పలికి ప్రయాణికులకు మెరుగైన సేవలందించాలన్నారు. కార్యక్రమంలో తుని హెల్త్ ఇన్‌స్పెక్టర్ రోహిత్, స్టేషన్ మాస్టర్ రవికిశోర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

సామర్లకోట: కార్పొరేట్ విద్యా సంస్థల్లో చదువుకునేందుకు ఉచిత ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా విద్యా సంస్థల్లో విద్యా హక్కు చట్టం ప్రకారం 25 శాతం సీట్లు ఉచితంగా ఇవ్వాలన్నారు. ఆర్థికంగా వెనుకబడిన వారు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన వారు దరఖాస్తులు చేసుకోవచ్చునని తెలిపారు. విద్యార్థులు నివాసానికి సమీపంలోనే ప్రైవేటు విద్యా సంస్థల్లో ఉచిత సీట్లకు ఈనెల 23 నుంచి మార్చి 14వ తేదీ లోపుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. విద్యార్థులకు సంబంధించిన ఆధార్, జనన ధ్రువీకరణ పత్రాలు జత పరచాల్సి ఉంటుందన్నారు. వివరాలకు 18004258599 నంబరులో సంప్రదించాలన్నారు.

ఓటే వజ్రాయుధం



విద్యార్థులను ఓటు ఆకారంలో కూర్చోబెట్టి అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ

కొత్తపల్లి: ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధమని మండల విద్యాశాఖాధికారి వేణుగోపాల్ అన్నారు. మండలంలోని వాకతిప్ప జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటుహక్కును నమోదు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాగులో మెళకువలు పాటిస్తే అధిక దిగుబడులు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న పిఠాపురం ఉద్యాన అధికారి శైలజ

పిఠాపురం: ఆయిల్‌పామ్ సాగులో మెళకువలు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని పిఠాపురం ఉద్యానశాఖాధికారి కేఎస్ శైలజ అన్నారు. గొల్లప్రోలు మండలం చెందుర్తిలో శుక్రవారం ఉద్యానశాఖ, పెద్దాపురం పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధుల ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయిల్ పామ్ సాగుపై రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం రాయితీపై ఇస్తున్న బిందుసేద్యం, మొక్కలు, ఎరువులను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మొక్కలు పెంపకం, తెగుళ్ల నివారణ, గెలల కోతలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ కంపెనీ డీజీఎం డి.రవీంద్ర, మేనేజర్ బి.వెంకటేశ్వర్లు, ఫీల్డ్ ఆఫీసర్ డీఎల్ వెంకటేశ్వరరావు, క్లస్టర్ ఇన్‌చార్జి టీడీవీ సత్యనారాయణ, వీహెచ్ఏ సురేష్, మధు తదితరులు పాల్గొన్నారు.



భువనేశ్వరీ పీఠంలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



తాటిపర్తిలో సూర్యభగవానునికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు



పెద్దాపురం భువనేశ్వరి పీఠంలో సూర్య నమస్కారాలు



సామర్లకోట పంచారామ క్షేత్రంలో సూర్యనారాయణమూర్తి కళ్యాణం

ప్రత్యక్ష నారాయణా ప్రణమామ్యహం

- భక్తిశ్రద్ధలతో రథసప్తమి
- పాలు పొంగించి నివేదించిన భక్తులు
- కిక్కిరిసిన ఆలయాల ఆవరణలు

పెద్దాపురం: మండలంలో రథ సప్తమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. స్థానిక అమరగిరి మెట్ట (పాండవుల మెట్ట)పై సూర్యనారాయణుని దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఆలయ కమిటీ నిర్వాహకులు వై.అనంతలక్ష్మి, గీతా వాణి, వై.కిషోర్ భక్తులకు ఏర్పాట్లు చేశారు. స్వామి దర్శనానికి సుమారు కిలోమీటరున్నర దూరం వరకు క్యూ కట్టారు. భక్తులు ఆవు పిడకలపై పాలు పొంగించి పరమాన్నం చేసి స్వామి వారికి నివేదించి ప్రసాదంగా స్వీకరించారు. నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కో–ఆర్డినేటర్ దవులూరి దొరబాబు, మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, రాష్ట్ర కార్మిక నాయకులు దవులూరి సుబ్బారావు తదితరులు స్వామి కళ్యాణాన్ని తిలకించారు. దొరబాబు మాట్లాడుతూ ఆరోగ్యం బాగుండాలంటే సూర్యారాధన ముఖ్యమన్నారు. స్వామి వారి దర్శనం పూర్వ జన్మ సుకృతమని ఆయన పేర్కొన్నారు. ఏటా ఇక్కడ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి, రథసప్తమి వేడుకలను నిర్వహిస్తున్న వాణిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. డీఎస్పీ లతాకుమారి ఆదేశాల మేరకు సీఐ రవికుమార్ పర్యవేక్షణలో ఎస్ఐ వెలుగుల సురేష్ భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు.

స్థానిక వర్జుల వారి వీధిలోని భువనేశ్వరి పీఠంలో లలితా వాస్తు జ్యోతిష్యాలయ నిర్వాహకులు చింతా గోపిశర్మ ఆధ్వర్యంలో త్వచ సౌర అరుణ సహిత సూర్య నమస్కారాలు చేశారు. అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

గుడివాడ శ్రీ కృష్ణాశ్రమంలో..

మండలంలోని గుడివాడ శ్రీకృష్ణాశ్రమంలో గురువు గవరసాని గోపాలకృష్ణ ఆధ్వర్యంలో చవ్వాకుల అప్పారావు, లక్ష్మీ, ఈశ్వరరావు, సంతోషి దంపతులు కర్తృత్వంలో సూర్య భగవానుడికి హోమం నిర్వహించారు. అలాగే సూర్య నమస్కారాలు చేసి రథ సప్తమి ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా భక్తులకు భారీ అన్నదానం నిర్వహించారు. గుండాబత్తుల సుబ్బరాజు, ఉప్పులూరి గంగాధరం, చవ్వాకుల వీరభద్రరావు, కనపర్తి బాబ్జీ, పెచ్చెట్టి సూకామణి తదితరులు పాల్గొన్నారు.



పెద్దాపురం అమరగిరి సూర్యనారాయణమూర్తి ఆలయ ఆవరణలో పాలు పొంగిస్తున్న భక్తులు

పంచారామ క్షేత్రంలో భక్తుల కిటకిట

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలా త్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వర ఆలయంలోని సూర్యనారాయణమూర్తి ఆలయంలో శుక్రవారం స్వామి వారి కల్యాణం నేత్ర పర్వంగా జరిగింది. స్వామి వారికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేసి, పట్టు వస్త్రాలు, పూలతో అలంకరించారు. ఈఓ డి.నాగమల్లేశ్వర రావు, ఆలయ మాజీ ట్రస్టు బోర్డు సభ్యుల ఆధ్వర్యంలో మాజీ ట్రస్టుబోర్డు సభ్యులు చల్లా కుమారి, యండమూరి వెంకటసుబ్బారావు, కర్రి వెంకటలక్ష్మి, చల్లా సత్తిబాబు, బీవీ రమణ, కౌన్సిలర్ నేతల హరిబాబు పాల్గొన్ని భక్తులకు సేవలందించారు. భక్త సంఘం నాయకుడు యంద్రు వీరవెంకటసత్యనారాయణ, ఉమా రాజేశ్వరి దంపతులు పీటలపై కూర్చుని కల్యాణం జరిపించారు. ఆలయ పండితులు సన్నిధిరాజు వెంకన్న, భాస్కర్, చెరుకూరి రాంబాబు, చీమలకొండ గోపాలం, శ్రీకాకుళపు వినయ్ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం జరిగింది.

రామలింగేశ్వరస్వామి ఆలయంలో....

స్థానిక ఐదు తూముల వద్ద అన్నపూర్ణ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆలయ వ్యవస్థాపకులు పరమానందగిరి స్వామి ఆధ్వర్యంలో సూర్యనారాయణ మూర్తి కల్యాణం జరిగింది.



దుర్గాడలో ప్రత్యేక అలంకరణలో సూర్యభగవానుడు



సామర్లకోటలో సూర్యనారాయణమూర్తి కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

వల్లూరి వివేకానంద రావు, వాణి దంపతులు, చిత్రాడ సతీష్, విజయలక్ష్మి దంపతులు పీటలపై కూర్చుని కల్యాణం జరిపించారు. అలాగే స్థానిక మాండవ్యనారాయణస్వామి ఆలయం, జగదీశ్వర స్వామి ఆలయం, వేట్లపాలెం వేంకటేశ్వర ఆలయంలోను సూర్యనారాయణమూర్తి పూజలు నిర్వహించారు.

వైభవంగా రథసప్తమి వేడుకలు

- సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు

పిఠాపురం: రథ సప్తమి వేడుకులు పిఠాపురం, పెద్దాపురం నియోజకవర్గాల్లో శుక్రవారం ఘనంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచే ఆలయాలకు భక్తులు పోటెత్తారు. సూర్యభగవానుడికి పూజలు నిర్వహించారు. గ్రామాల్లోని ఆలయాల్లో పండితులు సూర్యభగవానుడికి వివిధ భంగిమల్లో సూర్యనమస్కారాలు సమర్పించారు. పిఠాపురంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కుక్కుటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక దాయిలాలుపై(ఆవు పిడకల పొయ్యి) ప్రసాదం తయారు చేసి సూర్య భగవానుడికి నివేదించారు. రథసప్తమి సందర్భంగా పాద గయ క్షేత్రంతో పాటు కుంతీమాధవస్వామి తదితర ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉప్పాడ సాగరతీరంలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి సూర్య నమస్కారాలు చేశారు. గొల్లప్రోలు మండలం దుర్గాడ, తాటిపర్తి రామలింగేశ్వరస్వామి, అపర్ణాదేవి ఆలయ ప్రాంగణాల్లో వెలసిన సూర్యనారాయణ మూర్తికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు అర్చనలు నిర్వహించారు. దుర్గాడలో సూర్యయంత్రం వేసి ప్రత్యేక పూజలు చేశారు. వందలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



దుర్గాడలో సూర్య యంత్రానికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ప్రజాదరణే విజయానికి నాంది



పార్టీలో చేరుతున్న వీర్రాజుపేట టీడీపీ కుటుంబ సభ్యులతో నియోజకవర్గ కో ఆర్డినేటర్ దొరబాబు

- నియోజకవర్గ కో–ఆర్డినేటర్ దవులూరి
- 300 మంది వైఎస్సార్ సీపీలో చేరిక

పెద్దాపురం: ప్రభుత్వ పాలనపై ప్రజలకున్న ప్రజాదరణే రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి నాంది అని నియోజకవర్గ కో–ఆర్డినేటర్ దవులూరి దొరబాబు అన్నారు. పట్టణంలో 26వ వార్డు వీర్రాజుపేట టీడీపీకి చెందిన సుమారు 50 కుటుంబాలకు చెందిన సుమారు 300 మంది శుక్రవారం మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరారు. మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు అధ్యక్షతన జరిగిన సమావేశంలో దొరబాబు మాట్లాడుతూ నవరత్నాలు పేరిట సీఎం జగన్ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ప్రజాభిమానంతో రానున్న ఎన్నికల్లో పార్టీ విజయం సాధించడం తథ్యమని దొరబాబు అన్నారు. అనంతరం వీర్రాజపేటకు చెందిన కొండక సత్యనారాయణ, తారు చంద్రరావు, గంటా వీరబాబు, కొండపల్లి మల్లిబాబు, తదితర సుమారు 50 కుటుంబాల సభ్యులకు ఆయన పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీ రాష్ట్ర కార్మిక నాయకుడు దవులూరి సుబ్బారావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, పెద్దాపురం వైస్ ఎంపీపీ మిరియాల రాజా, సామర్లకోట ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, మోరంపూడి రంగ, మేడిశెట్టి భద్రం, ఆయా వార్డుల కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యం

- ఆ దిశగా క్యాడర్ పని చేయాలి
- పార్టీ కాకినాడ పార్లమెంటరీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ చలమలశెట్టి సునీల్



సమావేశంలో మాట్లాడుతున్న చలమలశెట్టి సునీల్

పిఠాపురం: ప్రజలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చూడాలని కోరుకుంటున్నారని, ఈ నేపథ్యంలో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా నేతలు, కార్యకర్తలు పని చేయాలని ఆ పార్టీ కాకినాడ పార్లమెంటరీ నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి సునీల్ అన్నారు. స్థానిక మున్సిపల్ కల్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించిన వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం జగన్ సంక్షేమంతో పాటు రాష్ట్రాన్ని విస్తృతంగా అభివృద్ధి కూడా చేశారని చెప్పారు. గతంలో ఎప్పుడూ లేనివిధంగా 4 పోర్టులు, 10 హార్బర్లతో పాటు వైద్య కళాశాలలు నిర్మాణానికి శ్రీకారం చుట్టారని వివరించారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా రెన్యువబుల్ ఎనర్జీ రంగంలో భారీ పెట్టుబడులు తీసుకుని రావడంలో సీఎం జగన్ సత్ఫలితాలు సాధించారన్నారు. వీటితో పాటు ఇంకా అనేక రంగాల్లో చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకుని వెళ్లడం ద్వారా వైఎస్సార్ సీపీ అభ్యర్థులను మంచి మెజార్టీతో గెలిపించుకుని, వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసి రాష్ట్రాన్ని మరింతగా అభివృద్ధి పథంలో నడిపించాలని సునీల్ పిలుపునిచ్చారు. టీడీపీ – జనసేన పొత్తు వల్ల వైఎస్సార్ సీపీకి, తనకు ఎటువంటి ఇబ్బందీ ఉండదని చెప్పారు.

కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ కో ఆర్డినేటర్ వంగా గీత మాట్లాడుతూ, అభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ సంక్షేమ పాలన సాగిస్తున్నారని అన్నారు. అందుకే మళ్లీ ఆయనే రావాలని ప్రజలు కోరుకుంటున్నారని, దీనికి వైఎస్సార్ సీపీ క్యాడర్ అంతా కలసికట్టుగా పని చేయాలని కోరారు. నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించడానికి తమకు అందరూ సహకరించాలని కోరారు. ఎమ్మెల్యే పెండెం దొరబాబు మాట్లాడుతూ, నాలుగున్నరేళ్లలో దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పాలన అందించి, ప్రజల మన్ననలు పొందిన ముఖ్యమంత్రి జగన్ ఒక్కరేనని అన్నారు. ప్రజలు మళ్లీ ఆయననే కోరుకుంటున్నారని చెప్పారు. తనకు సహకరించినట్టుగానే వంగా గీతకు, సునీల్‌కు సహకరించి, పార్టీని మళ్లీ అధికారంలోకి తీసుకుని రావడానికి అందరూ కృషి చేయాలని కోరారు. నియోజకవర్గవ్యాప్తంగా భారీగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు సునీల్‌కు, వంగా గీతకు ఘన స్వాగతం పలికారు.

నాణ్యమైన వైద్యసేవలే ప్రభుత్వ లక్ష్యం



జగనన్న సురక్ష కిట్లను అందజేస్తున్న వీరరాఘవరావు



కొమరగిరిలో జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లు పంపిణీ చేస్తున్న అధికారులు

పెద్దాపురం: రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల ఆరోగ్య సమస్యలను వారి ఇంటి వద్దే గుర్తించి నాణ్యమైన వైద్యాన్ని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కంటే వీరరాఘవరావు అన్నారు. రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వడ్లమూరులో పంచాయతీ కార్యదర్శి కళ అధ్యక్షతన రోగులకు వైద్య సేవలు అందించారు. తొలుత ఆయన రిబ్బన్ కట్ చేసి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య సేవలను ప్రారంభించారు. అనంతరం రోగులకు మందులను పంపిణీ చేశారు. అక్షయ్, వంశీ, మూర్తి, లోవమణి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'సురక్ష'తో పేదలకూ కార్పొరేట్ వైద్యం

కొత్తపల్లి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా పేదలకు సైతం కార్పొరేట్ స్థాయి వైద్యం అందుతోందని ఎంపీడీఓ వి.వెంకటనారాయణ అన్నారు. మండలంలోని కొమరగిరి శివారు నాగంపేట ఎంపీపీ పాఠశాలలో శుక్రవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. కొమరగిరి పీహెచ్‌సీ వైద్యాధికారి సందీప్ పర్యవేక్షణలో డాక్టర్లు 329 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో న్యూట్రిషన్ స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వం వైద్య రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రవికుమార్, వైద్య సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆవులను తరలిస్తున్న కంటైనర్ సీజ్

పిఠాపురం: ఆవులను అక్రమంగా కబేళాలకు తరలిస్తున్న కంటైనర్‌ను శుక్రవారం పట్టుకున్నట్లు గొల్లప్రోలు ఎస్సై బాలాజీ తెలిపారు. వాహనాల్లో ఆవులను తరలిస్తున్నారనే ముందస్తు సమాచారం మేరకు గొల్లప్రోలు మండలం వన్నెపూడి జంక్షన్ వద్ద పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. విజయనగరం నుంచి చెన్నైకు వెళ్లే కంటైనర్‌ను ఆపి తనిఖీ చేయగా అక్రమంగా ఆవులను తరలిస్తున్నట్లు గుర్తించారు. 40 ఆవులను స్వాధీనం చేసుకుని ఆవులను తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆస్పత్రి అభివృద్ధికి సహకరిస్తా

పెద్దాపురం: ఏరియా ఆసుపత్రి అభివృద్ధిలో దాతలు భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే చినరాజప్ప అన్నారు. స్థానిక ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం శుక్రవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ సూర్యకుమారి అధ్యక్షతన జరిగింది. ఆసుపత్రి అభివృద్ధికి తన వంతు సహకరిస్తానని ఆయన అన్నారు. మండల విస్తరణాధికారి కె.రాజశేఖర్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మరిడమ్మకు పూజలు



వెండి, బంగారు పుష్పాలతో పూజలందుకుంటున్న అమ్మవారు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పు మరిడమ్మ తల్లికి శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో ఘనంగా పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహనరావుల ఆధ్వర్యంలో కార్తిక మాస ద్వాదశి పూజల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, చండీహోమంతో పాటు బంగారు, వెండి పుష్పాలతో పూజలు నిర్వహించారు.

ఆంధ్రా బాప్టిస్టు చర్చి సేవలు అభినందనీయం



వేడుకల్లో మాట్లాడుతున్న దవులూరి దొరబాబు

సామర్లకోట: ఆంధ్ర భాప్టిస్టు చర్చి సేవలు అభినందనీయమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు అన్నారు. ఆంధ్ర బాప్టిస్టు చర్చి వజ్రోత్సవాల్లో శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. చర్చి అధ్యక్షుడు బీఎస్ వందం అధ్యక్షతన క్రైస్తవులకు మంచి బోధనలు చేస్తున్నారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అయ్యేలా ప్రార్థించాలన్నారు. దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు బైబిల్‌లోని వాక్యాలు చదివి తన కుమారుడిని ఎమ్మెల్యేగా అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. 60 సంవత్సరాల ఆలయ చరిత్ర సావనీర్‌ను ఆవిష్కరించారు. ప్రతి నెల 10 మంది వృద్ధులకు పింఛన్లు ఇవ్వాలని వందం నిర్ణయించారు. ఈ సందర్భంగా 50 మందికి చీరలు పంపిణీ చేశారు. విశాఖపట్టణానికి చెందిన క్రైస్తవ మత బోధకుడు డాక్టరు డేవిడ్ విక్టర్, బాప్టిస్టు థియాలాజికల్ సెమినారి ప్రిన్సిపాల్ కె రంజిత్‌కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్లు ఉబా జాన్‌మోజెస్, నెక్కంటి సాయిప్రసాద్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

వాహన డ్రైవర్ల ధర్నా

పెద్దాపురం: హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ స్థానిక ఆర్టీఓ కార్యాలయం వద్ద శుక్రవారం వాహన డ్రైవర్లు ధర్నా చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో దేశ వ్యాప్త ఆందోళనలో భాగంగా ఆర్టీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ నిరసన చేపట్టారు. ఆటో యూనియన్ల అధ్యక్షులు జాలా కామరాజు, ఎన్.సింహాచలం, లారీ డ్రైవర్ల యూనియన్ నాయకులు వై.రవి, గూడ్స్‌వ్యాన్ అధ్యక్షులు పూసపాటి వాసు తదితరులు ఆర్టీఓ కార్యాలయ డీటీ భానుకుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

ఫుడ్ టెక్నాలజీ విభాగంలో జనరేటర్ ప్రారంభం

బాలాజీచెరువు: జేఎన్‌టీయూకే ఫుడ్ టెక్నాలజీ విభాగంలో రూ.16 లక్షలతో ఏర్పాటు చేసిన 160 కేవీ జనరేటర్‌ను శుక్రవారం వీసీ ప్రసాదరాజు ప్రారంభించారు. వర్సిటీ ఆవరణలో ఉన్న ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌కు నిరంతరరం విద్యుత్ సరఫరా ఉండేందుకు వీలు కలుగుతుందని, నమూనా పరీక్షలు, విద్యార్థుల ప్రాక్టికల్స్‌కు అంతరాయం లేకుండా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఫుడ్ టెక్నాలజీ విభాగాధిపతి మాలోతు రమేష్, రిజిస్ట్రార్ సుమలత, ఏఈ భాస్కరరావు పాల్గొన్నారు.